## విశ్వజ్ఞానయజ్ఞం – 2021

## మహాత్ములు నేటి తరానికి మార్గదర్శకులు

### పదకవితాయోగి - శ్రీ అన్నమాచార్య మొదటి రోజు (6/19/2021)




శివాయ గురవే నమః

శ్రీమాత్రేనమః

శ్రీవిష్ణురూపాయనమఃశివాయ

క్రితం ఏడాది మన సంస్కృతిని మన జాతీయతని, సందేశాలని, స్ఫూర్తిని ప్రసాదించిన అనేకమంది మహాత్ముల గురించి చెప్పుకున్నాం. అప్పుడు చెప్పనటువంటి కొంతమంది మహాత్ములని ఈ సంపుటిలో మనం చెప్పుకోబోతున్నాము.

**ఇవాళ, రేపు అన్నమాచర్య! (6/19/2021, 6/20/2021)**

- యోగం అంటే ఉత్తమవిషయంతో కలవడం, అలాంటి కలయికకు సాధన పేరు కూడా యోగమే!
- భక్తుడి పేరు చెప్పగానే భగవంతుడు గుర్తుకి రావడం అంటే ఆ భక్తుడి జన్మ చరితార్థం అయినట్లు! అలా అన్నమాచార్య అనగానే శ్రీవేంకటేశ్వరుడు గుర్తుకు వస్తాడు!
- తెలుగు వారి భాగ్యం అన్నమాచర్య! భారతీయ సంస్కృతిలో, ఆధ్యాత్మిక సంస్కృతిలో అన్నమాచర్య కి ప్రత్యేక స్థానం ఉన్నది.
- సాహిత్యం అనగానే అద్భుత కల్పనలు, భావాలు ఉంటాయి, అన్నిటికీ మించి ఇలాంటి యోగులు రచించిన సాహిత్యం యుగయుగములు, తరతరములు ఏ జాతినైనా స్పందింప చేసే స్ఫూర్తిదాయకమైన బోధలు కూడా ఉంటాయి.
- అన్నమయ్య వాంగ్మయాన్ని వెలికి తీసిన వారిలో వేటూరి ప్రభాకర శాస్త్రిగారు, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు. వారు ఉభయులూ ప్రథమతః అన్నమయ్య సంకీర్తన భాండారంలోని రాగిరేకులను భద్రపరచి ఒక వ్యవస్థ ఏర్పాటు చేసారు. శ్రీ పీవీర్కే ప్రసాద్ గారు అన్నమాచర్య ప్రాజెక్ట్ అని ఒకటి ఏర్పాటు చేసి ఎంతో కృషి చేసారు.
- ప్రత్యేకంగా అన్నమాచార్య కీర్తనలని విస్తార స్థాయిలో స్వరపరచి ముందుకి తీసుకు వచ్చినది శ్రీనేదునూరి వారు అని చెప్పాలి. అన్నమాచార్య కీర్తనలని ఆస్వాదించేవారు వీరికి కృతజ్ఞతలు చెప్పుకోవాలి.
- గరిమెళ్ళ బాలకృష్ణప్రసాద్ గారు తర్వాత అంత విస్తారంగా స్వరపరిచారు. అన్నమయ్య ఎలా అయితే యతి స్థానములు రచించారో దానిప్రకారంగా విభాగం చేసారు. అన్నమాచారికి శిష్య పరంపర లేదు కావున, ఎలా పాడేవారో తెలియదు. అందుకు ఆయన స్వరరచన దొరకలేదు! సాహిత్యం మాత్రమే దొరికింది.
- గరిమెళ్ళ వారు సాహిత్య భావం చెడకుండా అద్భుతంగా స్వరపరిచారు! అలాగే ఇతరులు శోభరాజ్ గారు, పారుపల్లి గారు ఇలా చాలా మంది స్వరపరిచారు.
- **వీరందరి వల్ల అన్నమయ్య సాహిత్యం ప్రజలలోకి వెళ్ళింది. తెలుగు గొప్పతనం, ఆ మహానుభావుడి యొక్క తాత్త్వికత, దార్శనికత, అనుభవం, కర్మ, భక్తి ప్రబోధములు ప్రజలకి లభించింది.**

**<u>అన్నమాచార్య చరిత్ర</u>**

చారిత్రక ఆధారాలు కొన్ని దొరుకుతున్నాయి. ప్రధాన ఆధారం చిన్న తిరుమలాచార్య రచించిన ద్విపద కావ్యం. అన్నమయ్య తల్లితండ్రులు లక్కమాంబ, నారాయణ సూరి! ఊహించడానికి కూడా సాధ్యం కాని ప్రతిభామూర్తి

అన్నమయ్య! నారాయణుడి ఖడ్గం అయినటువంటి నందకాంశ అని చాలా మంది భావించారు. అలాంటి అంశ లేకుండా ఒక చేత్తో 32,000 కీర్తనలు రచించగలరా? దొరుకుతున్నవి 14,000! ఏ కీర్తనకి ఆ కీర్తన ఒక ప్రత్యేక కావ్యంలా ఉంటుంది! ఆయన సమస్త భావాలని, ఆర్తిని వేంకటేశ్వర స్వామికి అర్పించుకున్నారు! పరమ వైరాగ్యం, అనురక్తికి ప్రధాన భావమైన శృంగార భావంలో కూడా కీర్తనలు రచించారు! అనురక్తి, విరక్తి రెండూ కూడా వేంకటేశ్వర పాదభక్తిగా పరిణమించి అంతటి విస్తారమైన వాంగ్మయాన్ని అందించారు. ఆయన రచించిన కీర్తనల్లో తెలుగులోనూ, సంస్కృతంలోనూ కీర్తనలు ఉన్నాయి!

- వీరికి పదకవితా పితామహుడు అని పేరు! అన్నమయ్యకు పూర్వమే పదములు ఉండేవి, అవన్నీ గమనించి వారి కీర్తనల్లో ఇమిడేటట్లు రచించారు! ఈ పదకవిత్వాలని కూడా పండితులు, రాజులూ గౌరవించేలా రచించారు! నన్నయ్య వలెనే అన్నమయ్య కూడా పదకవితని చక్కగా సముద్ధరణ చేసి అపారమైన ప్రతిభతో వేదాంతం, పురాణం, తాత్త్వికత వీటన్నిటిని కలిపి ఉదాత్తమైన స్థాయిలో రచించి పదకవితలకి ఆ గౌరవాన్ని కలిగించారు.
- తొలి సంకీర్తనాచార్యుడు అని కూడా చెప్పవచ్చు! సంకీర్తనలకి ఆయన ఆది అని చెప్పాలి. తెలుగువాడిగా మనం ఎంతో గర్వించాలి! మనదయిన సంస్కృతి, భాష దెబ్బ తింటున్నాయి! విద్యా సంస్థల్లో, ఇళ్లలో తెలుగు మాటలే లేవు! ఒక్క తెలుగు వాక్యం చెప్తే అందులో 90% ఆంగ్ల వాక్యాలే ఉంటున్నాయి! ఒక్కటి మాత్రం సంతోషించవలసిన విషయం సంగీతం నేర్చుకుంటూ అన్నమయ్య, త్యాగయ్య కీర్తనలు పాడుతున్నారు! ఆంగ్లంలో రచించుకుని పాడుతున్నారు, ఏదో ఒకటి ఇప్పుడు పాడితే ఎప్పటికో అప్పుడు దాని భావం తెలుసుకోవాలని ప్రయత్నిస్తే వారికి తెలుగు భాష ఇంకా బాగా అర్థమవుతుంది. ఆ భాషలో ఎలాంటి వాంఙ్మయం పుట్టింది? ప్రపంచంలో ఏ భాషలో వారైనా ఆశ్చర్యపోయేటువంటి వాంగ్మయం, నాగరికత, సంస్కృతి నా భాషకి ఉన్నది అనే భావం పిల్లలకి కలిగితే చాలు. మన సంగీతం మన భాషని బ్రతికిస్తున్నాయి.

బాలాంత్రపు రజనీకాంత్ గారు అంటారు "**తెలుగు పాట అన్నమయ్య నోట విశ్వరూపం ధరించింది** అని! ఇది అద్భుతమైన మాట!

- ఎన్ని సొబగులు చూపించవచ్చు పాటల్లో అని మహాపండితుడు అయిన అన్నమయ్య తన ప్రతిభతో చూపించారు! ***చక్కటి తెలుగు మాటలు, అద్భుత సంస్కృత పదజాలం ఈ రెండింటితో వేంకటేశ్వర స్వామిని కీర్తించడమే కాక, సార్వకాలిక సత్యాలు, వాస్తవాలు, సిద్ధాంతాలు, నీతులు, శ్రుతివాక్యాలు*** ఇన్ని బోధ చేసారు! కొన్ని పురాణాలూ తెలియకపోతే అన్నమయ్య కీర్తనలు అర్థం కావు, అలా పురాణాల మర్మాలు ఉంచారు! ఎన్నో నీతివాక్యాలు ఉన్నాయి అన్నమయ్య పాటల్లో!

**పుట్టుక**

1408 లో జన్మించారని కొందరు, 1424 అని కొందరు అన్నారు.

వైశాఖ పూర్ణిమ నాడు ఉద్భవించారు!

1503 ఫాల్గుణ శుద్ధ ద్వాదశి నాడు వేంకటేశ్వరునిలో ఐక్యం అయ్యారు.

రాగిరేకుల మీద శాలివాహన శకం ప్రకారంగా చెప్పారు!

**అన్నమయ్య తిరుమల వెళ్లడం**

తన ఎనిమిదవ ఏట అనుకోకుండా యాత్రికులతో వేంకటేశ్వరుని కొండకి బయలుదేరారు, ఏదో అంతప్రేరణతో! అలా వెళుతూ ఉండగా ఒకచోట అలిసిపోయి నిద్రపోయాడు! మెలకువ వచ్చి చూసాక వాణి వినపడింది! అది జగన్మాత మహాలక్ష్మి దేవి వాణి! ఆవిడ చెప్తున్నది, "బాలకా! ఈ పర్వతంబు సాలగ్రామమయము సుమా! మహాత్ములైన వారు దీనిని చెప్పులతో ఎక్కరు సుమా!" అని చెప్పినది! (ఈ దృష్టితో తిరుమలని భావించాలి!) సాలగ్రామము అనగా విష్ణుశిల! సాలగ్రామ శాస్త్రము అని కూడా ఉన్నది! తిరుమల కొండ మీద ప్రతీ రాయి కూడా సాలగ్రామము!

వెంటనే ఆయన చెప్పులు వదిలి వేసాడు! వెంటనే ప్రతీ శిలా కూడా శ్రీ రామ కృష్ణ, లక్ష్మి నారాయణ, నరసింహ ఇలా విష్ణుమయంగా కనపడింది! అదే రచించారు కదా "అదివో అల్లదివో" అంటూ!

(క్షేత్రాలని భావనతో చూడాలి!)

అన్నమయ్య అలా తిరుమలని చూడగానే, ఆ తల్లి తన స్వరూపాన్ని చూపించింది, పిల్లవాడు ఆకలితో ఉన్నాడని భోజనం పెట్టింది. తాను విష్ణువు కలిసి ఏ నివేదనలు పుచ్చుకుని ప్రసాదంగా మార్చారో దాన్ని ప్రేమతో తినిపించింది. అమ్మ పెట్టిన అన్నం తిన్నాడు కనుక మహానుభావుడయ్యాడు. వెంటనే అమ్మని కీర్తించాడు "చొచ్చితి తల్లి నీ మరుగు... వేంకటేశ్వరా" అంటూ! ఈయన చెన్నకేశవ శతకం, వేంకటేశ్వర శతకం అని రచించారుట! సంకీర్తన లక్షణములు అంటూ సంస్కృతంలో రచించారట! ఆ లక్షణాలని తన కీర్తనల్లో చూపించారట!

**ఏ యుగంలో ఎలా తరిస్తారు?**

కృత - తపస్సులు

త్రేతా - యజ్ఞములు

ద్వాపర - అర్చనలు

కలి - సంకీర్తన

వీటితో తరించుతారని శాస్త్రాలు చెప్తున్నాయి!

**<u>సంకీర్తనల గొప్పతనం</u>**

- సంకీర్తనలు వింటున్నా, చదువుతున్నా తాదాత్మ్యం వస్తుంది! 1) అది భగవదనుభూతి ఇస్తుంది, 2) అంతేకాక సాత్విక భావాలను పెంచుతుంది. అంతేకాక మనకి భరోసాని, ఆసరాని ఇస్తాయి! భగవంతుడున్నాడు, ధర్మంగా ఉంటే రక్షిస్తాడు అనే ఊరట వస్తుంది. సాత్త్విక చింతన కలిగించి, పరమాత్మ భావాన్ని వృద్ధి చేయడంలో సంకీర్తన పని చేస్తుంది.
- సంకీర్తన లక్షణం అనే సంస్కృత గ్రంథాన్ని చిన్నన్న అనువదించారు. అది దొరుకుతున్నది. పదము - పల్లవి, చరణాలు ఉంటాయి. పల్లవిలో ప్రధాన భావం ఉంటుంది, చరణాల్లో విస్తారం ఉంటుంది! ప్రతీ చరణానికి పల్లవిని అనుసంధానం చేయాలని చెప్పారు. ఇప్పటికి అలాగే నడుస్తున్నది.
- రాగిరేకుల మీద ఇది శృంగార కీర్తన, ఇది ఆధ్యాత్మిక కీర్తన అని ఆయనే విభాగం చేసారు. మనకి దొరికే కీర్తనల్లో సుమారు 2200 పైచిలుకు ఆధ్యాత్మిక కీర్తనలు ఉన్నాయి. శృంగార కీర్తనలు కూడా దివ్యములైనవి అవి అర్థం చేస్కుని ఉదాత్త దృష్టితో చూడాలి.
- లక్షణ శాస్త్రంలో ఈ ఆధ్యాత్మిక కీర్తనలు ఎలా ఉండాలో చెప్పారు, ఇలా ఒక లక్షణ శాస్త్రాన్ని ఏర్పాటు చేసారు. తద్వారా ఆయన రచించిన వేలాది కీర్తనలు ఆ లక్షణాలకి అనుగుణంగా ఉన్న లక్ష్యంగా గోచరిస్తున్నాయి. ఆయన కీర్తనలని శాస్త్రములని అధ్యయనం చేస్తే ఎన్నో అద్భుతాలు తెలుస్తాయి!

**<u>అన్నమయ్య సంకీర్తన యజ్ఞం</u>**

- అమ్మవారు అనుగ్రహించాక ఆ మహానుభావుడు తన 16వ ఏట స్వామి దర్శనానికి వెళ్లారు. ఒక్కొక్కటి చూస్తూ ఒక్కొక్క ఆనందం కలిగి అప్పటికప్పుడు కీర్తనలు వచ్చాయి.
  1. స్వామి పుష్కరిణి – "దేవునికి దేవికి తెప్పల కోనేరమ్మ"
  2. విశ్వక్సేనుడు – "నీవేకా చెప్పిచూప నీవెకా…. సేన మొదలారి"
- స్వామిని చూసి ఆయన చెప్పిన కీర్తనలు అనేకాలు! ***అక్కడ నుండి తన చివరి ఊపిరి వరకూ తన సర్వస్వం వేంకటేశ్వరుడిగా బ్రతికాడు! అది భక్తి అంటే! అలా పరిపూర్ణమైన భక్తితో సమస్త భావములు స్వామిపైనే తిప్పుతూ తాను నేర్చుకున్నవి, శాస్త్రాల్లో ఉన్నవి అన్నీ కూడా!***
- ***<u>భావుకతతో రచించిన కవి కాడు ఆయన!</u> పైగా గురువు ఉపదేశాన్ని పొంది చాలా సునిశితంగా ఉపాసన చేసాడు, తపస్సు చేసాడు! మహాత్ముల అందరి వెనక జ్ఞాన బలమే కాక ఉపాసనా బలం కూడా ఉన్నది. ఆ బలం చేత ఆ మాహానుభావుడు ఎన్నో దివ్యానుభూతులు పొంది, రచించి, విన్న వారికి కూడా ఆ అనుభూతి కలిగేలా చేస్తున్నాడు.***

- మొత్తానికి ఆ వేంకటగిరి చేరాక, ఆయన స్థితి సమాధి స్థితికి చేరింది. ఆయన అక్కడ శుద్ధిగా స్నానం చేసి ఒక వస్త్రం ఆరవేసి, మరో వస్త్రం కట్టుకుని కూర్చున్నాడు, అది ఆరేలోపల శతకం చెప్పాడు! అంత ప్రతిభ అమ్మ పెట్టిన అన్నం వల్ల!
- ఆ మహానుభావుడు అక్కడ ఉంటూ స్వామిపై అనేక కీర్తనలు చేసిన తర్వాత, "ఘనవిష్ణువు" అనే వైష్ణవ గురువు వెతుక్కుంటే వచ్చి ఈయనకి విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని బోధించి, వైష్ణవ మతంలోకి తీసుకొచ్చారు! ఆయన తిరుమలలోనే ఉండిపోయాడు! కానీ బంధువులు వచ్చి ఇంటికి తీసుకెళ్లి వివాహం చేసారు, తిరుమలమ్మ, అక్కలమ్మలని! తిరుమలమ్మ కూడా గొప్ప కవయిత్రి! గృహస్థ ధర్మంలో ఉంటూ ఉన్నా కూడా వేంకటేశ్వర భక్తి ఏ మాత్రం తగ్గలేదు! స్వామిని దర్శించుకుంటూ, కీర్తనలు రచిస్తూ ఉన్నాడు.
- స్వామి ఆదేశించారుట నా పైన కీర్తనలు చేయి అని! అప్పుడు ఈ మహానుభావుడు దినముకొక కీర్తన రచిస్తాను అనుకున్నారట. కానీ దినానికి ఒక్కటికంటే ఎక్కువే రచించారు. ***సంకీర్తన ఒక యజ్ఞంగా, యాగంగా, యోగంగా, ఒక తపస్సుగా, సాధనగా చేసాడు కనుకనే సిద్ధిని పొందాడు! స్వామిని ఆజ్ఞాపించినది మొదలు స్వామిలో ఐక్యం అయ్యేవరకు సంకీర్తన యజ్ఞం చేస్తూనే ఉన్నారు!***

**అన్నమాచార్య సాహిత్యానికి పేరు పెట్టాలంటే "వేంకటేశ్వర విజ్ఞాన సర్వస్వం" అని పేరు పెట్టాలి.**

- అంతేకాక అటు తర్వాత అహోబల క్షేత్రానికి చేరి శఠగోప యంతీంద్రులు అనే ఆచార్యుని ఆశ్రయించి విశిష్ట అద్వైత సిద్ధాంతాలని అధ్యయనం చేసి, ఆ బోధలని తన కీర్తనల్లో చూపించాడు!
- అంతేకాక లక్ష్మీనృసింహ మంత్రాన్ని ఉపదేశం పొంది, ఉపాసించి, సిద్ధి పొందారు! ఆ ఉపాసన బలం కనపడుతుంది ఆ కీర్తనల్లో! అహోబలేశ్వరునిపై అనేక కీర్తనలు చేసారు ఆయన!

3. "అహోబలేశ్వరుడు అరికులదమనుడు"
4. "అనిశము తలచర అహోబలం"

**అన్నమయ్య కీర్తనలలో అనేక కోణాలు**

ఏ దేవతని కీర్తించినా ప్రతీ కీర్తనలో "వేంకట" ఉండి తీరుతుంది!

1) వేంకటేశ్వర విజ్ఞానం

2) విశిష్టాద్వైత ప్రబోధాలు

3) తాత్త్వికత - భారతీయ తత్త్వ చింతన చిన్న చిన్న మాటల్లో సామాన్యులకి కూడా అందేలా రచించారు!

4) వివిధ పురాణాల్లో ఉన్న భగవత్ లీలా వైభవం

#రాములవారిపై రచించిన కీర్తనలన్నీ ఒక దగ్గర తీసుకొస్తే రామాయణం తయారవుతుంది
#శ్రీకృష్ణపరమాత్మ పై అనేక కీర్తనలు రచించారు! జననం మొదలు గీతాబోధ వరకూ రచించారు! ఒకప్పుడు అన్నమయ్య దర్శించిన కృష్ణుడు అంటూ ప్రవించాచారు పూజ్య గురువులు!
#నృసింహుని పై అనేక కీర్తనలు చేసారు! ఆయన ఉపాసించిన దేవతానుగ్రహం ఆ కీర్తనల్లో గోచరిస్తుంది.
#హనుమంతుని పై అనేక కీర్తనలు! పరాశర సంహితకి సంబంధించిన రహస్యాలు ఎన్నో ఉంటాయి!
# గీతాబోధని కీర్తనలుగా రచించారు! అన్నమయ్య చెప్పిన భగవద్గీత అని అనవచ్చు!
5) ఆయన వాడిన భాష, ఆనాటి జానపదాలు ఇవన్నీ చూస్తే అదంతా ఒక పరిశోధన
6) ఆయనకున్న సంగీత, నాట్య పరిజ్ఞానం అమోఘం! అది ఆ కీర్తనల్లో కనిపిస్తుంది, మన మనస్సులో నాట్యం జరుగుతుందా అనిపిస్తుంది

5. అలరులు కురియగనాడినదే
6. తత్థాదిగుడు ధిధి
7. తిరుతిరు జవరాల

ఇలా జతులని పల్లవుల్లోనే చరణాల్లో పెట్టడంలో నాట్యవిశేషాలు చూపిస్తారు!
మన కళలన్నింటికీ ఒక దివ్యమైన ఆధారంగా ఆయన వాంగ్మయాన్ని నిలపెట్టాడు. దాన్నిపట్టి ఎన్ని కోణాల్లో ఆయన కీర్తనలని దర్శించవచ్చో తెలుస్తున్నది! ఎంతో మంది పరిశోధనలు చేసి అనేక గ్రంథాలని అందించారు! ఆయన 95 ఏళ్ళు జీవించి అద్భుత వాంఙ్మయాన్ని అందించారు!

**అన్నమయ్య దర్శించిన వేంకటేశ్వరుడు**

తిరుమల స్వర్ణతేజస్సుతో గోచరించింది ఆయనకి! తిరుమలపై భక్తి, పూర్వ జన్మల సాధనలు తోడు అయితే తిరుమల ఎలా కనపడుతుందో ఈయన కీర్తనల్లో చూడవచ్చు.

8. అదివో అల్లదివో … బహుబ్రహ్మమయం
9. కట్టెదుర వైకుంఠం

ప|| కట్టెదుర వైకుంఠము కాణాచయిన కొండ | తెట్టలాయ మహిమలే తిరుమలకొండ ||

చ|| వేదములే శిలలై వెలసినది కొండ | యేదెస బుణ్యరాసులే యేరులైనది కొండ |
గాదిలి బ్రహ్మదిలోకముల కొనల కొండ | శ్రీదేవుడుండేటి శేషాద్రి కొండ ||

చ|| సర్వదేవతలు మృగజాతులై చరించేకొండ | నిర్వహించి జలధులే నిట్టచరులైన కొండ |
వుర్విదపసులే తరువులై నిలచిన కొండ | పూర్వటంజనాద్రి యీ పొడవాటి కొండ ||

చ|| వరములు కొటారుగా వక్కాణించి పెంచే కొండ | పరగు లక్ష్మీకాంతుసోబనపు గొండ |
కురిసి సంపదలెల్ల గుహల నిండిన కొండ | విరివైన దదివో శ్రీవేంకటపు గొండ ||

మహిమలు తెట్టెలు కట్టాయట కొండమీద! అంత మహిమాన్వితం తిరుమల కొండ! ఎంత వేగం దర్శనం అవుతుందా అని చూసేవారికి కనపడదు! ఇప్పటికి సాధన చేసి, ఉపాసన చేసి దర్శించేవారికి ఆ దర్శనం ఉంటుంది.

* వేదములే శిలలై వెలసినది కొండ | యేదెస బుణ్యరాసులే యేరులైనది కొండ

స్వామి వేదవేద్యుడు! వేదములను కొండలతో పోలుస్తారు! కొండనెక్కి శిఖరాన్ని ఎక్కడం ఎంత కష్టమో, వేదాలను అధ్యయనము చేసి పరతత్త్వాన్ని పొందడం అంతే కష్టం. అనేక రకాల జలప్రవాహాలు ఉన్నాయి! వందలాది తీర్థాలు నేడు కనపడుతున్నాయి! మాసానికి ఒక తీర్థం దగ్గర ఉత్సవం చేయడం కనపడుతుంది! ప్రతీ తీర్థం ఒక పుణ్యరాశి!

గాదిలి బ్రహ్మాదిలోకముల కొనల కొండ

బ్రహ్మాది లోకాల దాకా ఉంటాయి ఆ కొండ శిఖరాలు!

శ్రీదేవుడుండేటి శేషాద్రి కొండ

శ్రీపతి అయిన నారాయణుడు ఉండే శేషాద్రి కొండ!

ఇదంతా అన్నమయ్య దర్శనం! అనుభవం!

కురిసి సంపదలెల్ల గుహల నిండిన కొండ - ఇప్పటికీ రహస్యమైన గుహలు ఉన్నాయి అక్కడ!

## 10. కంటి నఖిలాండ కర్తనధికుని గంటి

కంటి నఖిలాండ కర్తనధికుని గంటి
కంటి నఘములు వీడుకొంటి నిజమూర్తి గంటి ||

మహనీయ ఘన ఫణామణుల శైలము గంటి
బహు విభవముల మంటపములు గంటి
సహజ నవరత్న కాంచన వేదికలు గంటి
రహి వహించిన గోపురంబులవె కంటి ||

పావనంబైన పాపవినాశనము గంటి
కైవశంబగు గగన గంగ గంటి

దైవికపు పుణ్యతీర్థములెల్ల బొడగంటి
కోవిదులు గొనియాడు కోనేరి గంటి ||

పరమ యోగీంద్రులకు భావగోచరమైన
సరిలేని పాదాంబుజముల గంటి
తిరమైన గిరిచూపు దివ్యహస్తము గంటి
తిరు వేంకటాచలాధిపు జూడగంటి ||

నేను నారాయణుడిని చూసాను! ఆయన సర్వాధికుడు, అఖిల బ్రహ్మాండ నాయకుడు! ఆయన అసలు మూర్తిని చూసాను, చూసినవెంటనే పాపాలు పటాపంచలు అయ్యాయి అంటూ కీర్తించారు! ఎటువంటి పాదాలు చూసాను అంటే పరమయోగీంద్రులకు భావగోచారమైనవి ఆ చేయి ఏమని చూపిస్తున్నది అంటే ఈ దివ్య పర్వతాన్ని ఆశ్రయించండి అని చుపిస్తున్నట్లుంది

11. పొడగంటిమయ్య

పొడగంటిమయ్య మిమ్ము పురుషోత్తమా మమ్ము
నెడయకవయ్య కోనేటి రాయడా
కోరిమమ్ము నేలినట్టి కులదైవమా, చాల
నేరిచి పెద్దలిచ్చిన నిధానమా
గారవించి దప్పిదీర్చు కాలమేఘమా, మాకు
చేరువజిత్తములోని శ్రీనివాసుడా

భావింప గైవసమైన పారిజాతమా, మమ్ము
చేవదేర గాచినట్టి చింతామణీ
కావించి కోరికలిచ్చే కామధేనువా, మమ్ము
తావై రక్షించేటి ధరణీధరా

చెడనీక బ్రతికించే సిద్ధమంత్రమా, రోగా
లడచి రక్షించే దివ్యౌషధమా
బడిబాయక తిరిగే ప్రాణబంధుడా, మమ్ము
గడియించినట్టి శ్రీ వేంకటనాథుడా

నిను చూసానయ్యా అంటూ ఆనందంతో చెప్తున్నాడు!

**<u>చాలా నేరిచి పెద్దలిచ్చిన నిధానమా - మా పెద్దలిచ్చిన నిధానమునవు స్వామి!</u>** ఈయన గొప్ప దైవమని ఎవరు చెప్పారు? ఋషులు శృతుల ద్వారా, పురాణాల ద్వారా చాలా జ్ఞానం పొంది మనకి ఇచ్చిన నిధానం!

**<u>పెద్దలేమి ఆస్తి ఇచ్చారు అని కాదు, భగవంతుని కొలుచుకో అనే బుద్ధిని ఇవ్వడమే గొప్ప ఆస్తి!</u>**

తాపత్రయంతో బాధపడే వారికి నల్లని మబ్బు పట్టగానే దాహం, తాపం పోతాయి, అలా నువ్వు నీలమేఘశ్యాముడవై జన్మజన్మల ఆర్తిని, దాహాన్ని, తాపాన్ని పోగొడుతున్నావయ్యా!

చేరువ చిత్తములోని శ్రీనివాసుడా

**అన్నమయ్య కీర్తనల్లో గొప్పతనం ఏంటంటే అర్చామూర్తిని చూస్తూనే అంతర్యామిగా ఆయన ఉన్నాడు అని భావిస్తాడు! అంతర్యామికి అర్చామూర్తికి సమన్వయము అదే సాధన! భగవంతుడు బాహ్య వస్తువు కాదు! నీ అంతరికమైన హృదయం, నీ హృదయంలో ఉన్నాడు ఆయన! అందుకే రెండిటికీ సమన్వయించాలి.**

**అందుకే**

**12. భావములోనా బాహ్యమునందును**

ఎప్పుడైనా దేవత అంటే ఆ దేవతకి సంబంధించిన మంత్రము యొక్క మూర్తియే! మంత్రము ఆ దేవత యొక్క శబ్దరూపమే! “చెడనీక బ్రతికించే సిద్ధమంత్రమా”

“బడిబాయక తిరిగే ప్రాణబంధుడా” - భక్తులని వదలకుండా తిరిగే స్వామి

“మమ్ము గడియించుకున్న శ్రీవేంకటనాథుడా” - ఆయన వరించి తెచ్చుకోవాలి మనం వెళ్లగలమా? ఆ యోగ్యతను సంపాదించుకోవాలి!

**<u>స్వామి మూర్తి</u>**

13. కంటి కంటి నిలువు చక్కని మేనుదండలను

చూసాను చూసాను అని ఆనందంతో! చెప్తున్నారు! చక్కని మేను, దండలు

“అంటుచూపులు” స్వామివి అంటే భక్తుల హృదయానికి తాకుతున్నాయిట! “నవ్వుమోము దేవుడు”

శ్రీదేవి భూదేవి ఎవరు? స్వామి అంతఃకరణం నుండి ప్రసరిస్తున్న శక్తులు.

**సర్వమూర్తులు ఇందులో ఉన్నాయని చెప్పే కీర్తన**

14. ఎంతమాత్రమున ఎవ్వరు చూచిన

పిండికొద్దీ రొట్టెలాగా భావము కొద్దీ భగవంతుడు! ఇదియే పరతత్త్వము మాకు అంటున్నారు!

## విరాట్పురుషుడి దర్శనం

15. చూడచూడ మాణిక్యాలు చుక్కల వలె ఉన్నవి”

“ఇంగితమెరిగి వేంకటేశుడు” - ఇంగితం అంటే ఎవరి హృదయంలో ఏమున్నదో తెలుసుకోవడం! అది భగవంతుడికి మాత్రమే తెలుస్తుంది!

“ముంగిట మూలభూతమై” - ఎన్ని సాధనలు చేసినా లభించని పరతత్త్వము ముంగిటకి సులభముగా వచ్చాడు!

## స్వామి అసలు స్వరూపం

16. నిత్యాత్ముడై ఉండి

ప : నిత్యాత్ముడై యుండి నిత్యుడై వెలుగొందు
సత్యాత్ముడై యుండి సత్యమై తానుండు
ప్రత్యక్షమై యుండి బ్రహ్మమై యుండు సం-
స్తుత్యుడీ తిరువేంకటాద్రివిభుడు

చ : ఏమూర్తి లోకంబులెల్ల నేలెడునాత-
డేమూర్తి బ్రహ్మాదులెల్ల వెదకెడునాత-
డేమూర్తి నిజమోక్షమియ్య జాలెడునాత-
డేమూర్తి లోకైకహితుడు
యేమూర్తి నిజమూర్తి యేమూర్తియును గాడు
యేమూర్తి త్రైమూర్తు లేకమైనయాత-
డేమూర్తి సర్వాత్ము డేమూర్తి పరమాత్ము-
డామూర్తి తిరువేంకటాద్రివిభుడు

చ : యేదేవుదేహమున నిన్నియును జన్మించె
నేదేవుదేహమున నిన్నియును నణగె మరి
యేదేవువిగ్రహం బీసకల మింతయును
యేదేవునేత్రంబు లినచంద్రులు

యేదేవు డీజీవులిన్నింటిలో నుండు
నేదేవుచైతన్య మిన్నిటికి నాధార-
మేదేవు డవ్యక్తు డేదేవు డద్వంద్వదు-
డాదేవుడీ వేంకటాద్రివిభుడు

చ : యేవేల్పుపాదయుగ మిలయునాకాశంబు
యేవేల్పుపాదకేశాంతం బనంతంబు
యేవేల్పునిశ్వాస మీమహామారుతము
యేవేల్పునిజదాసు లీపుణ్యులు
యేవేల్పు సర్వేశు డేవేల్పు పరమేశు-
డేవేల్పు భువనైకహితమనోభావకుడు
యేవేల్పు కడుసూక్ష్మ మేవేల్పు కడుఘనము
ఆవేల్పు తిరువేంకటాద్రివిభుడు

**<u>ఉదయం నుండి అస్తమయం వరకూ స్వామికి జరిగే సేవలు!</u>**

అన్నమయ్య కీర్తనలు చదువుకుంటే స్వామి దర్శనము చక్కగా చేస్కోవచ్చు! సేవలు చేస్కోవచ్చు!

**సుప్రభాత సేవ - మనస్సులో స్వామి ఉదయిస్తే అదే సుప్రభాతం**

17. మేలుకో శృంగారరాయ
18. విన్నపాలు వినవలె వింతవింతలు
19. మిన్నక వేశాలు మాని మేలుకోవయ్యా
20.మేదిని జీవులకావ మేలుకోవయ్యా

**మజ్జన సేవ (స్నానం)**

మలయప్ప స్వామికి నిత్యమూ స్నానం చేయిస్తారు

21. సందడి విడువుము

**శుక్రవార అభిషేకం**

22.కంటి శుక్రవారం గడియలేడంట

అభిషేకం తర్వాత 24 మూరల ధోవతీ, 12 మూరల ఉత్తరీయం కడతారు!

అక్కడున్న బంగారు బావి జలంతో, గోక్షీరంతో అభిషేకము చేస్తారు.

**భోగనివేదన**

స్వామికి నైవేద్యం - స్వామికి తిండిమెండయ్య అని పేరుట

ఎన్ని వండినా వడ్డించేది మాత్రం అమ్మవారే అట! పాకశాలకి ఎదురుగా అమ్మవారుంటారు.

తిండిమెండయ్య అంటే రకరకాల నైవేద్యాలు!

23. ఇందిర వడ్డించె ఇంపుగను

**పూలంగిసేవ**

పూజలందరును చేసే పుష్పయాగము

పూలంగిసేవ అనేది అన్నమాచార్య కాలానికి ఉండేది, మధ్యలో పోయింది, తిరిగి PVRK ప్రసాద్ గారు ఉద్ధరించారు.

**ఊయల సేవ**

24. జో అచ్యుతానంద
25. చందమామ రావే
26. లాలనుచు ఊచేరు
27. అలరచంచలమైన ఆత్మనందుండ

అలర చంచలమైన ఆత్మలందుండ నీ యలవాటు చేసె నీవుయ్యాల
పలుమారు నుచ్ఛ్వాస పవనమందుండ నీ భావంబు దెలిపె నీ వుయ్యాల||

ఉదాయాస్త శైలంబు లొనర కంభములైన వుడుమండలము మోచె నుయ్యాల
అదన ఆకాశపదము అడ్డొదూలంబైన అఖిలంబు నిండె నీ వుయ్యాల
పదిలముగ వేదములు బంగారు చేరులై పట్టి వెరపై తోచె వుయ్యాల
వదలకిటు ధర్మదేవత పీఠమై మిగుల వర్ణింప నరుదాయె వుయ్యాల||

మేలు కట్లయి మీకు మేఘమణ్డలమెల్ల మెరుగునకు మెరుగాయె వుయ్యాల
నీల శైలమువంటి నీ మేనికాంతికి నిజమైన తొడవాయె వుయ్యాల
పాలిండ్లు కదలగా పయ్యదలు రాపాడ భామినులు వడినూచు వుయ్యాల
వోలి బ్రహ్మాణ్డములు వొరగువో యని భీతి నొయ్య నొయ్యనైరి వూచిరుయ్యాల||

కమలకును భూసతికి కదలు కదలకు మిమ్ము కౌగలింపగజేసె నుయ్యాల
అమరాంగనలకు నీ హాస భావ విలాస మందంద చూపె నీ వుయ్యాల
కమలాసనాదులకు కన్నుల పండుగై గణుతింప నరుదాయె వుయ్యాల
కమనీయ మూర్తి వేంకటశైలపతి నీకు కడువేడుకై వుండె వుయ్యాల||

#ఊగిసలాడుతున్న మీ చిత్తములో ఉండడానికి అలవాటు చేసుకోవడానికి అభ్యాసం చేస్తున్నాడట స్వామి ఊయల ఊగుతూ!
#అలాగే ఉచ్ఛ్వాస, నిశ్వాసలలో ఊగిసలాడే వాడు భగవానుడు! ఊయలను, అందులోని స్వామిని ఎలా దర్శిస్తున్నాడో గమనించాలి!
#భూమి ప్రధానంగా ఊయలగా ఉంటూ, ఆకాశపథం అడ్డదూలగా ఉందిట! నక్షత్రమండలం దాకా ఊగుతూ ఉన్నది! బ్రహ్మాండం అంతా ఊయల, అంతర్యామి అయిన భగవానుడు అందులో ఉన్నాడు!
#ధర్మము పీఠముగా వేదములు గొలుసులుగా ఉన్న ఊయలలో ఉన్నాడుట
#ఆకాశాన్ని ఊయలగా దర్శించారు! నీలాకాశం పరుపుగా ఉంటే అది నీ మేనికాంతికి తగినట్లుగా ఉన్నది అంటున్నారు.

కులశేఖర ఆళ్వార్ పడి బయటే నైవేద్యాలన్నీ! లోపల మాత్రం మట్టి పాత్రలో చేసిన సంకటి మాత్రమే!
ఒక్కొక్క సేవ ఒక్కొక్క భక్తుడి పేరు మీద ఉంటుంది! తరిగొండ వెంగమాంబ హారతి మొదలైనవి!
తోమని పళ్లాల వాడు అంటారు ఒక కీర్తనలో (వేడుకొందామా)
మట్టిపాత్రని తోమరు ఏ రోజుకి ఆ రోజే!
కుమ్మరి భక్తుడి కథ! (కుమ్మరదాసుడైన కురువరత్తి నంబి) - ఈయన మట్టిపాత్రలో సంకటి ఇచ్చారట! దాని గుర్తుగా నేటికీ అలాగే పెడతారు!

**అన్నమయ్య కీర్తనలు - బ్రహ్మోత్సవాలు**

ఎన్నో కీర్తనలు రచించారు!

28. తిరువీధుల నేగే" - పదిరోజులు ఏ ఏ సేవలో వర్ణిస్తారు!
29. తిరువీధులనేగిని దేవతలు"

**<u>అంతర్యామి అర్చామూర్తి సమన్వయము</u>**

అర్చామూర్తి అంటే ఎదురుగా స్వామి విగ్రహం. సనాతన ధర్మంలో విగ్రహాలు పూజిస్తారు అనుకోవడం అజ్ఞానం. ఒక తత్త్వాన్ని విగ్రహంగా ఆవిష్కరింప చేస్కుని అది అంతఃకరణంలో దర్శిస్తారు, ఆ విగ్రహంలో మంత్రశక్తితో దైవాన్ని ఆరాధించి ఆ శక్తి ద్వారా లోకాన్ని రక్షిస్తారు.

అందునా స్వామి స్వయంభువు! అన్నమయ్య తత్త్వం తెలిసి పూజిస్తారు! విశ్వాత్మకుడు అని తెలుసుకుని చేస్తారు!

**భగవంతుడికి పూజలు కావాలా?**

ఆయనకి కావాలి అన్నట్లు చేస్తే మనకి కావలసినవి ఇస్తాడు!

భగవంతుడికి నివేదించిన పదార్థం ప్రసాదమై లోకాన్ని అనుగ్రహిస్తుంది! దేశం క్షేమంగా ఉండడానికి కారణం అనేక దేవాలయాల్లో ఉన్న అర్చామూర్తులకి శాస్త్రవిధి తప్పకుండ జరుగుతున్నా కైంకర్యాల బలము! ఆ క్షేత్రదేవాలయాల్లో ఉన్న దేవతలు అనుగ్రహించడం మూలానే!

తత్త్వదృష్టితో అర్చన చేయమన్నారు, విడవమనలేదు! ఎంతవరకూ తింటూ ఉంటామో అంతవరకూ నివేదనలు చేయాలి! చేసేటప్పుడు అహంకరించరాదు! నేను చేస్తున్నాను అనుకోవడానికి లేదు! ఎవరు పదహారు కళల పరిపూర్ణుడో ఆయనకి నేను చేస్తున్నానా అని ఆశ్చర్యపోతూ చేయాలి!

30.షోడశకలానిధికి

షోడస కళానిధికి షోడశోపచారములు
జాడతోడ నిచ్చలును సమర్పయామి

అలరు విశ్వాత్మకున కావాహన మిదె సర్వ
నిలయున కాసనము నెమ్మి నిదే
అలగంగా జనకున కర్ఘ్యపాద్యాచమనాలు
జలధి శాయికిని మజ్జనమిదే

వరపీతాంబరునకు వస్త్రాలంకారమిదె
సరి శ్రీమంతునకు భూషణము లివే
ధరణీధరునకు గంధపుష్ప ధూపములు
తిర మిదె కోటిసూర్యతేజునకు దీపము

అమృతమథనునకు నదివో నైవేద్యము
గమి(రవి)జంద్రునేత్రునకు కప్పురవిడెము
అమరిన శ్రీవేంకటాద్రి మీది దేవునికి
తమితో ప్రదక్షిణాలు దండములు నివిగో
విశ్వవ్యాపకునికి ఆవాహనము
సర్వనిలయునకు ఉండడానికి చోటు
గంగాజనకుడికి అర్ఘ్యపాద్య ఆచమనాలు
వరపీతాంబరునికి వస్త్ర, అలంకారములు
భగవంతుడిని కొలుచుకోవడం అంటే ఇదే! అప్రమేయుడు అయినా భగవంతుడిని అందినంత
కొలుచుకోవడము! ఇది ఎలాంటిది అంటే నదీజలాన్ని కావలసినంత తెచ్చుకోవడం!

**కొలుచుకోవడం ఎందుకు?**

అపరిమితుడిని పరిమిత బుద్ధులతో ఆరాధించుకుంటాము ఎందుకు? బ్రతుకు బాగుపడడానికి! పరిమితత్త్వము నుండి అపరిమితత్త్వములోకి, అంతత్త్వము నుండి అనంతత్త్వము లోకి లీనం అవ్వడానికి.

31. నిత్యపూజలివిగో నేరిచిననోహో

నిత్య పూజలివిగో నేరిచిన నోహో
ప్రత్యక్షమైనట్టి పరమాత్మునికి || నిత్య ||

తనువే గుడియట తలయే శిఖరమట పెను హృదయమే హరి పీఠమట
కనుగొను చూపులే ఘనదీపములట తనలోపలి అంతర్యామికిని

పలుకే మంత్రమట పాదయిన నాలికే కలకలమను పిడిఘంటయట
నలువైన రుచులే నైవేద్యములట తలపులోపలనున్న దైవమునకు

గమన చేష్టలే అంగరంగ గతియట తమి గల జీవుడే దాసుడట
అమరిన ఊర్పులే ఆలవట్టములట క్రమముతో శ్రీ వేంకటరాయునికి

అమరిన ఊర్పులే ఆలవట్టములట ఊపిరిలే వింజామరలు అట!

**భగవంతుడిని హృదయం నిండా నింపుకుని అన్నీ భగవంతుడికి అంకితం చేసిన వాడు, భగవద్భావనతో జీవించేవాడు మాట్లాడితే మంత్రం అవుతుంది.**

**<u>అన్నమాచార్య శృంగార కీర్తనల స్థాయి</u>**

- దీనిలో ఒకానొక యోగరహస్యం ఉన్నది! ఆంతర్యం పరిశీలించాలి! నాయికానాయకుల లక్షణాలు, స్థాయి భావాలు తెలియాలి. శృంగారాన్ని దివ్యత్వంతో ముడిపెట్టగానే అవి ప్రకోపకరమైన లౌకిక స్థాయి నుండి దివ్యత్వ స్థాయికి వెళ్లి ముక్తికి హేతువు అవుతాయి.
- మానవుల్లో తీవ్రమైన ఆనంద కాంక్ష శృంగారంలో కనపడుతుంది, అది ఆనందమే తానైన పరమాత్మవైపు తిప్పితే యోగం అవుతుంది.

32.చాలు చాలను భోగసమయమున

చాలుచాలును భోగసమయమున మైమఱపు
పాలుపడునట యేటి బ్రతుకురా ఓరీ

ఇందుముఖినిను కౌగిలించి లోపలి జగము
కందునని నీ బిగువు కౌగిలే వదలె
పొందైన వారితో పొసగ కౌగిట జేర్ప
పొందుగాదట యేటి పొందురా ఓరీ

నెలత నీ వాలు కన్నులు మూసి జగమెల్ల
కలయ చీకట్లైన గక్కనను వదలె
వలచిన అంగనలు తమ వలసిన విలాసముల
వలను నెఱపనిదేటి వలపురా ఓరీ

కొమ్మ నీ ఉరముపై గోరు దివియుచునాత్మ
నిమ్మైన ననుతాక నిద్దరిని తాకె
దిమ్మరివి కోనేటి తిమ్మ నీపై ప్రియము
కుమ్మరించని దేటి కోర్కిరా ఓరీ

ఆయనతో సరసంగా ఏదయినా చేద్దామంటే కష్టమట! ఎందుకంటే ఆవిడ ఆనందంగా కౌగిలించుకుందిట కానీ వెంటనే విడిచిపెట్టింది ఎందుకంటే లోకాలు కందుతాయి అని! స్వామి కన్నులు మూద్దాము అనుకుంటే లోకాలన్నీ చీకటి అయ్యాయట, వెంటనే వదిలిపేసిందిట

33. నిన్ను బాసినయట్లు నెలతకు వియోగదశలు

ప|| నిన్ను బాసినయట్లు నెలతకు వియోగదశ | లెన్నడును దోప విదియేమోకాని ||

చ|| నిను దలచి లలితాంగి నీరూపమాత్మలో | గని నీవు సవి బయలు కౌగలించినది |
తనర నాకాశ తత్త్వము నీమహాత్త్వమని | వనిత యెవ్వరి చేత వినెనో కాని ||

చ|| నిను బొగడి నీరూపు కనుదోయి కెదురైన | తనివిదీరక బయలు తగ జూడ దొడగె |
మునుకొన్న సర్వతోముఖుడ వనగా నిన్ను | వెనకకే భావమున వినెనోకాని ||

చ|| తలపునను వాక్కునను తలప దలపగ నీవు | కలసి యాకమలాక్షి గౌగలించితివి |
తెలిసితిమి వేంకటాధిపతి నీ విన్నింట | గలవనెడి మాట నిక్కంబులో కాని ||

వియోగంతో బాధపడుతున్నదిట! కానీ వియోగంలో ఉన్నట్లు లేదే నిత్యా సంయోగంలో ఉన్నది అంటున్నారు! భగవంతుడు సర్వవ్యాపకుడు అయినప్పుడు వియోగం ఏమిటి? భావనలో కలిసి ఉండడమే సంయోగము! స్వామిని తలంచుకుంటూ కూర్చుందిట, ఎదురుగా ఉన్నాడనుకుని ఆలింగనం చేసుకుందిట, అవునులే ఆకాశం నీ శరీరమేగా!

34. సకలం హే సఖి జానామి

సకలం హేసఖి జానామె తత్ ప్రకత విలాసం పరమం దధసే

అలిక మృగ మద మయ మషి కలనౌ జ్వలతాహే సఖి జానామే
లలితం తవ పల్లవి తమనసి నిస్చలతర మేఘ శ్యామం దధసే

చారుకపోల స్థల కరాంకిత విచారం హే సఖి జానామే
నారయణ మహినాయక శయనం శ్రీ రమనం తవ చిత్తే దధసే

ఘన కుచ శైల క్రస్చిత విభుమని జననం హే సఖి జానామే
కనతురస వేంకట గిరిపతి వినుత భోగ సుఖ విభవం దధసే..

ఆ సఖి వియోగంతో బాధ పడుతూ బుగ్గ కింద చేయి పెట్టి ఉందిట! ఎవరి గురించి తలంచుకుంటున్నావు అంటే చెప్పదుట! అప్పుడు ఆ చెలి చేయిపెట్టుకున్న తీరు చూసి నువ్వు శేషశయనునే తలంచుకుంటున్నావులే అంటున్నారు.

35. ప్రతిలేని పూజదల పంగకోటి మణుగులై అతివ పరవశము బ్రహ్మానందమాయె మానినీమణి మనసు మంచి ఆసనమాయె ఆనందబాష్పజలములు అర్ఘ్యములాయె"

అంటూ పూజ చూపిస్తున్నారు!

ప్రతిలేని పూజదల పంగకోటి మణుగులై
అతివ పరవశము బ్రహ్మానందమాయె

మానినీమణిమనసు మంచియాసనమాయె
ఆనందబాష్పజల మర్ఘ్యాదులాయె
మీనాక్షి కనుదోయి మించుదీపములాయె
ఆనన సుధారసంబభిషేకమాయె

మగువచిరునవ్వులే మంచి క్రొవ్విరులాయె
తగుమేనితావి చందనమలదుటాయె
నిగనిగనీతనుకాంతి నీరాజనంబాయె
జగడంపుటలుకలుపచారంబులాయె

ననుపైన బొందులె నైవేద్య తతులాయె
తనివోని వేడుకలు తాంబూలమాయె
వనిత శ్రీ వేంకటేశ్వరుని కౌగిట జేయు
వినయ వివరంబు లరవిరిమ్రొక్కులాయె

36. ఏమొకో చిగురుటధరమున
ఏమొకో చిగురుటధరమున ఎడనెడకస్తూరి నిండెను
భామిని విభునకు వ్రాసిన పత్రిక కాదు కదా

కలికి చకోరాక్షికి కడకన్నులు కెంపైతోచిన

చెలువంబిప్పుడిదేమో చింతింపరేచెలులు
నలువున ప్రాణేశ్వరునిపై నాటినయాకొనచూపులు
నిలువునపెరుకగనంటిన నెత్తురుకాదుకదా

పడతికి చనుగవమెరుగులు పైపై పయ్యెద వెలుపల
కడుమించిన విధమేమో కనుగొనరే చెలులు
వుడుగని వేడుకతో ప్రియుడొత్తిన నఖశశిరేఖలు
వెడలగవేసవికాలపు వెన్నెలకాదుకదా

ముద్దియ చెక్కులకెలకుల ముత్యపుజల్లుల చేర్పుల
వొద్దికలాగులివేమో ఊహింపరే చెలులు
గద్దరి తిరువేంకటపతి కొగిటియధరామృతముల
అద్దిన సురతపు చెమటల అందము కాదు కదా

భర్తతో ఉన్న శయ్యాగృహము నుండి అమ్మవారు వస్తూ ఉంటె చెలికత్తెలు ఆటపట్టిస్తున్నారట!
కళ్ళు ఎర్రబడ్డాయి చూసావా, ఆమె చూపులు నాటుకుపోయాయిట స్వామి మీద, అయితే బయటికి రావడానికి ఆ చూపులు పెరికి రావడం వల్లన ఎర్రబడ్డాయి అని ఉదాత్త భావం చూపారు!

**సాళ్వ రాజు తనపై రచించమని అడిగినప్పుడు**

37. నరహరి కీర్తన నానిన జిహ్వ ఒరులనుతింప నోపదు జిహ్వ" అన్నాడు

సత్యాన్ని పట్టుకుని, భగవంతుడు ఉన్నాడు అనే ధైర్యం ఉన్నవాడు ఎంత ధీరంగా ఉంటాడో తెలుసుకోవాలి !
భగవద్భక్తి ధైర్యం ఇస్తుంది!

ఆ రాజు చెరలో పెట్టినప్పుడు రచించిన కీర్తన

38. "ద్వారకాపురములో తగ నర్తమాడే నీకు బిరాన ద్రౌపది మొరపెట్టినయట్లు"

వెంటనే ఆయన సంకెళ్లు ఊడిపోయాయి!
అలా ఊడకొట్టింది నరసింహ స్వామిట!
అప్పుడు ఆ రాజు సభలో సంకెళ్లు వేయించాడట! అప్పుడు చెప్పిన కీర్తన

39. ఆకటి వేళల అలపైన వేళల - భగవద్భక్తి కలిగినవాడు ధర్మానికి కట్టుబడినప్పుడు భగవంతుడు రక్షిస్తాడు అని మనకి బోధ! రాజు చూస్తూ ఉండగానే సంకెళ్లు విడిపోయాయి!

ఆకటి వేళల అలపైన వేళల
తేకువ హరినామమే దిక్కు మరి లేదు

కొఱమారియున్న వేళ కులము చెడిన వేళ
చెఱవడి వొరుల చేజిక్కినవేళ
వొఱపైన హరినామమొక్కటే గతి గాక
మఱచి తప్పిననైన మఱి లేదు తెరగు

ఆపద వచ్చిన వేళ ఆరడి బడిన వేళ
పాపపు వేళల భయపడిన వేళ
వోపినంత హరినామ మొక్కటే గతి గాక
మాపు దాకా పొరలిన మరిలేదు తెరగు

సంకెల బెట్టిన వేళ చంప బిలిచిన వేళ
అంకిలిగా నప్పుల వారాగిన వేళ
వేంకటేశు నామమే విడిపించ గతిగాక
మంకు బుద్ధి పొరలిన మరిలేదు తెరగు

## <u>నరసింహ స్వామి మీద కీర్తనలు</u>

40.నగుమొగము తోడి ఓ నరకేసరి" నరసింహస్వామి ముఖములో నవ్వు చూసాడు ఈయన!

ప|| నగు మొగము తోడి వో నరకేసరి | నగ రూప గరుడాద్రి నరకేసరి ||

చ|| అమిత దానవ హరణ ఆదినరకేసరి | అమిత బ్రహ్మాది సుర నరకేసరి |
కమలాగ్ర వామాంక కనక నరకేసరి | నమో నమో పరమేశ నరకేసరి ||

చ|| రవిచంద్ర శిఖ నేత్ర రౌద్ర నర కేసరి | నవ నారసింహ నమో నర కేసరి |
భవనాశినీ తీర భవ్య నర కేసరి | నవరసాలంకార నర కేసరి ||

చ|| శరణాగత త్రాణ సౌమ్య నరకేసరి | నరక మోచన నామ నరకేసరి |

హరి నమో శ్రీ వేంకటాద్రి నరకేసరి | నరసింహ జయ జయతు నరకేసరి ||

41. కదిరి నృసింహుడు కంబమున వెడలె - స్వామివారి ఉగ్రత తెలుగు మాటల్లో చూపారు!

ప : కదిరి నృసింహుడు కంభమున వెడలే

విదితముగా సేవించరో మునులు

చ : ఫాలలోచనము భయదోగ్ర ముఖము

జ్వాలామయ కేశరములునూ

కాలరౌద్ర సంఘటిత దంతములు

హేలాగతి ధరియించుక నిలిచే

చ : ముడివడు బొమ్మలు ముంచిన ఊర్పులు

గడగడ నదరెడి కటములునూ

నిడుత నాలుకయు నిక్కు కర్ణములు

నడియాలపు రూపై వెలసే

చ : సకలాయుధములు సహస్ర భుజములు

వికట నఖంబులు వెసబూనీ

వెకలియగుచు శ్రీవేంకటేశ్వరుడు

ప్రకటపు దుష్టుల భంజించేనిదివో

42. శరణని బ్రతుకరో జనులాల గరిమి మెరసెనిదే కనకసింహము- స్వామిని శరణు అని బ్రతకండి అని బోధ చేస్తూ అనేక నరసింహ మూర్తులను చూపిస్తున్నారు! కథ కూడా చెప్తున్నారు! తెలుగు పదాల పోహళింపుతో నరసింహ సాక్షాత్కారం చేయిస్తున్నారు.

(||పల్లవి||)శరణని బ్రదుకరో జనులాల

గరిమ మెరసె నిదె కనకసింహము (||శర||)

అహరహమును బ్రహ్లాదుఁడు దొరకొని

బహువిధముల హరిమహిమలు వొగడఁగ

కహకహ హిరణ్యకసిపుఁడు నగి హరి

సహజ మేదియని చఱచెఁ గంభము

అటమరి పెటపెటమని బేంట్లెగసి

చిటచిటరవములఁ జిరుతపొగ లెగసి

తటతట మనుచును తరలి వ్రయ్యలై

పటపటమనుచును పగిలెఁ గంభము (॥శర॥)

బెడిదపు చూపుల మిడుఁగురు లెగయఁగ

పుడమి యదర నూర్పులు చెలఁగ

గడగడ వడఁకి దిక్తటము లల్లాడఁగ

వెడలెఁ గంభమున విజయసింహము (॥శర॥)

నగవుల సుడివడె నభోంతరంబులు

పొగ లెగసెను పెనుబొమముళ్ళ

పగటు నార్పులను పగిలెనుఁ గొండలు

వెగటుగ వెడలెను వీరసింహము (॥శర॥)

తెఱచిన నోరఁ బ్రతిధ్వను లెసగఁగ

కఱకుగతుల చుక్కలు చెదర

నెఱి హుంకృతులను నిఖిలము బెదరఁగ

వెఱచఱవఁ గెరలె విమలసింహము (॥శర॥)

పటువిహారముల బ్రహ్మాండ మగల

గుటగుటరవళి నాకులు వొగడ

నిటలనేత్రమున నెఱమంట లడర

పటుగతి మెరసెను భయదసింహము (॥శర॥)

పెదపెదకోఱల పిడుగులు రాలఁగ

తుదనఖముల నెత్తురు దొరుగ

గుదిగొను కసరుల కులగిరు లూఁటాడ

వుదయించె నదివో వుగ్రసింహము (॥శర॥)

అట్టహాసమున నసురలు వారఁగ

ముట్టి వాయువులు మొగతిరుగ

దట్టములై జలధరములు ముసరఁగ

దిట్టయై వెడలె ధీరసింహము (॥శర॥)

జలధులు గలఁగెను జడిసె లోకములు

తలఁకె సప్తపాతాళములు

వులికిపడఁ దొడఁగె నూర్ధ్వలోకములు

కొలువున నిలిచెను ఘోరసింహము (॥శర॥)

అచ్చట హిరణ్యు నదరంటఁబట్టి

యిచ్చలఁ దొడపై నిడి చించి

కుచ్చి వాని పేగులు జంధ్యములుగ

విచ్చి వేసుకొనె విష్ణుసింహము (॥శర॥)

పొగడిరి దివిజులు భువనములు వెలసె

పగయుడిగి చెలఁగెఁ బ్రహ్లాదుఁడు

మిగులశాంతమున మించె శ్రీవేంకట-

నగమున నహోబలనారసింహము (॥శర॥)

43.ఫాలనేత్రానల ప్రభల విద్యుల్లతా" - స్వామి ఆవిర్భావ ఘట్టం

ఫాలనేత్రానల ప్రబల విద్యుల్లతా కేళీ విహార లక్ష్మీనారసింహా

ప్రళయమారుత ఘోర భస్త్రీకాపూత్కార లలిత నిశ్వాసడోలా రచనయా

కులశైలకుంభినీ కుముదహిత రవిగగన- చలన విధినిపుణ నిశ్చల నారసింహా

వివరఘనవదన దుర్విధహసన నిష్ఠ్యూత- లవదివ్య పరుష లాలాఘటనయా

వివిధ జంతు వ్రాతభువన మగ్నొకరణ నవనవప్రియ గుణార్ణవ నారసింహా

దారుణోజ్జ్వల ధగద్ధగిత దంష్ట్రానల వికార స్ఫులింగ సంగక్రీడయా

వైరిదానవ ఘోరవంశ భస్మీకరణ- కారణ ప్రకట వేంకట నారసింహ్

గ్రహనక్షత్రాలు కదులుతున్నాయంటే ఏ గాలి వల్ల కదులుతున్నాయో అది ఆయన ఊర్పు!

**గాలి తగులుతుంది అంటే ఆయన ఊపిరి తగిలినంత దగ్గరగా భగవంతుడు ఉన్నాడని భావించాలి**

**సూర్యచంద్రులు కనపడుతున్నారు అంటే ఆయన కళ్ళతో చూస్తున్నాడు అని భావించాలి!**

**విశ్వమంతా విష్ణువుగా దర్శించే వేంకటేశ్వరుని భక్తుడు కనుక విశ్వవ్యాపకంగా విష్ణువుని దర్శించాడు, తన హృదయంలో ఉన్న ఆత్మగా దర్శించాడు, ఈ రెండి స్వరూపమే తనముందర ఉన్న వేంకటగిరి అర్చామూర్తిగా దర్శించాడు!**

# సర్వం శ్రీగురుచరణారవిందార్పణమస్తు